# సాపేక్షం

యామిని



రఘుపతి ఆ మధ్యాహ్నం అంతా ట్రెయినింగ్ క్లాసులకు వెళ్ళలేదు. హాస్టల్లో రూమ్‌లో ఒంటరిగా పచార్లుచేస్తూనే ఉన్నాడు. సాయంత్రానికి తలపోటు వచ్చేసింది. ఏదో బిళ్ళ తెప్పించి వేసుకొని హాస్టలు మెస్‌కు వెళ్ళి టీ తాగి వచ్చేడు. తలపోటు కొంచెం తగ్గినట్లనిపించింది కాని మనసులో బరువు తగ్గలేదు. మర్నాటితో ట్రెయినింగ్ పూర్తయిపోతుంది. తాను ఢిల్లీ విడిచి వెళ్ళిపోవాలి. పోయేలోపలే దాని సంగతేమిటో తేల్చుకోవాలి. గడచిన నాలుగు రోజుల్లోనూ దాని సంగతి తేల్చుకోడానికి రోజుకు రెండుసార్లు అటువైపు వెళ్ళనే వెళ్ళేడు. కాని తెగించి ఆనంద్ షాపులోకి వెళ్ళలేకపోయేడు. ఆ ఫోటో గురించి వివరాలు అడగలేకపోయేడు.

ఆ ఫోటో........

ట్రెయినింగ్‌లో తనకు కాస్త ఎక్కువ పరిచయం అయిన షోరీలాల్ అరోరాతో నాలుగురోజులక్రితం ఓ సాయంత్రం కరోల్‌బాగ్‌లోంచి వస్తున్నాడు.

ఉన్నట్లుండి ప్రక్కసందులో రిపేర్‌కి ఇచ్చిన రిస్టువాచీ తెచ్చుకొని వస్తానుండమని చెప్పి అరోరా అటువైపు నడిచేడు. రెండడుగులువేసి మళ్ళీ వెనక్కువచ్చి "అతను మీ తెలుగువాడే! పరిచయం చేస్తాను రా!" అన్నాడు.

వెనకాలే తనూ వెళ్ళేడు.

అది ఒక పెద్దసైజు కిళ్ళీకొట్టు డబ్బాలా ఉన్న వాచ్‌రిపేరింగ్ షాప్.

షాప్ అతను కుడికంటికి భూతద్దం బిగించుకొని రిపేర్ చేస్తున్నాడు. రఘుపతిని చూస్తూనే విష్‌చేసి కొద్దిసేపు చేతిలో పనిమీదకు దృష్టిమళ్ళించి అది పక్కకు పెట్టి కంటి అద్దం తీసేసి "ఆయీయే సాబ్!" అని రెండు రేకుస్టూల్స్ చూపించేడు షాపుముందు.

"మీట్ మై ఫ్రెండ్ మిస్టర్ రఘుపతి! హి ఈజ్ ఫ్రమ్ యువర్ సైడ్!" అని పరిచయం చేసేడు.

అతను చిరునవ్వుతో చేతులుకలిపి, "అయామ్ ఆనంద్! హౌడుయూడూ!" అన్నాడు.

పదినిముషాల తర్వాత అరోరా వాచీ తీసుకొని వచ్చేస్తూంటే, "పదిరోజులుంటారా?" అని అడిగేడు తనవైపు తిరిగి.

అయిదారు రోజులుంటానని చెప్పేడు తను.

లేచి వచ్చేస్తూంటే అరోరాకు చిల్లర ఇవ్వడంకోసం లోపలఉన్న అలమారు తలుపు తెరిచేడు ఆనంద్.

ఒక్కసారి తనకు షాక్‌తగిలినట్లయింది!

తనకళ్ళను తానే నమ్మలేకపోయేడు!

అలమారులో ఆ ఫోటో!

చిత్రంగా ఆ ఫోటో ఫ్రేములో ఫోటోతోపాటు ఒక లేడీస్ రిస్ట్‌వాచ్ కూడా అమర్చబడి ఉంది.

లేవడానికి బయలుదేరిన తను మరేమనలేక, "మళ్ళీ వస్తానండీ!" అని బయటకు వచ్చేసేడు.

అప్పటినుంచి ఎంత ప్రయత్నించినా అక్కడకు వెళ్ళలేకపోయేడు. కాని ఒక్కక్షణంకూడా ఆ ఫోటోను మరిచిపోలేకపోయేడు. యస్! అది ఈ రోజు తేల్చుకోవాల్సిందే!

రఘుపతి లేచి ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని బయలుదేరాడు. షాప్‌కు వెళ్ళగానే ఆనంద్ గుర్తుపట్టి ఎంతో స్నేహభావంతో పలుకరించేడు.

రఘుపతి అతన్ని పరిశీలనగా చూసేడు.

ఆనంద్ అంత రూపసి అని చెప్పడానికి లేదు. కాని ముఖంలో మాత్రం స్నేహభావం కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

ఆనంద్ టీ తెప్పించాడు.

పనిచేస్తూనే కబుర్లు చెప్తున్నాడు.

గంట గడిచిపోయింది. కాని రఘుపతి ఫోటో సంగతి ఎత్తలేకపోయేడు. చివరకు ఆనంద్ ఆసక్తి కనబరుస్తూ మాట్లాడుతూన్నా రఘుపతి మాటలు వెదుక్కోవలసి వస్తూంది.

ఉండి ఉండి అలమారు తెరిచిన సందర్భంలో తెగించి అడిగేసేడు రఘుపతి!

"అదేమిటి? ఫోటోతోపాటు వాచ్ పెట్టి ఫ్రేమ్‌చేసేరేమిటి? చిత్రంగా ఉంది!"

పనిచేస్తున్న ఆనంద్ పని ఆపి ఓసారి ఫోటోవైపు చూసి రఘుపతివైపు చూసేడు. రఘుపతి జవాబుకోసం ఎదురుచూస్తున్నాడు.

"ఏంలేదు. దటీజ్.........ఫాన్సీ" అన్నాడు.

"ఫాన్సీ!.........వింతగా ఉంది." అన్నాడు రఘుపతి మరేం మాట్లాడలేక.

కొంచెంసేపు సంభాషణ ఆగిపోయింది. రఘుపతికి సాహసించి పూర్తిగా అడగడంతప్ప గత్యంతరం కనిపించ లేదు.

"మీ కభ్యంతరం లేకపోతే .... ఆ ఫోటోనుగురించి రెండుమూడు ప్రశ్నలడుగవచ్చా!"

"మీకు దానిమీదెందుకు కుతూహలం కలిగింది?" అన్నాడు ఆనంద్ తల తిప్పకుండానే.

"ఎందుకో అడగాలనిపించింది. అంతే!"

"మీరు రచయితా?"

"కాదు. ఏం అలా అడిగేరు?"

"ఇదివరకో రచయిత ఇలాగే చాలా ప్రశ్నలడిగేడు దాన్నిగురించి."

"ఐసీ! ........ అయితే అడగ మంటారా?

"అడగండి."

"ఆమె ఎవరు?"

"వన్సపానెటైమ్ ........ నా గర్ల్ ఫ్రెండ్."

"ఇప్పుడు?"

"ఎ స్వీట్ అండ్ పెయిన్‌ఫుల్ మెమొరీ!"

"ఆవిడకూ మీకు పరిచయం ఎలా కలిగింది?"

"ఇద్దరం ఈ వూళ్ళో ఓ కాలేజీలోనే చదివేం."

"క్లాస్‌మేట్సా?"

"కాదు. నాకామె రెండుసంవత్సరాలు జూనియర్."

"మరి ఎలా పరిచయమైంది?"

"ఆమె చాలా అందగత్తె. ఆకర్షింప బడ్డాను. పరిచయం చేసుకున్నాను."

"అందంగా ఉన్నవాళ్ళందర్నీ పరిచయం చేసుకోంగా!"

"కరక్టే!....కాని ఆమె విషయంలో ఐ కుడ్ నాట్ రెసిస్ట్!........అది సరే కాని బాణాలు వేసినట్లు అలా ప్రశ్నలు వేసేస్తున్నారేమిటి?" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

"ప్రశ్నలు అయిపోయేయా?" ఆనంద్‌కుకూడా ఆమె చర్చ కావాలని పించినట్లుంది.

"లేదు. ఇంకా ఉన్నాయి."

"దెన్ మూట్!"

"ఆమెతో పరిచయం చేసుకోవడంలో మీ ఉద్దేశ్యం?"

"ఆమె స్నేహం సంపాదించాలని."

"స్నేహం సంపాదించి........ఏం చెయ్యాలని?"

రఘుపతి గొంతులో ఆవేశం స్ఫురించి ఆశ్చర్యంగా చూసేడు ఆనంద్ అతని వైపు. "అది అప్పుడు ఆలోచించలేదు." ఆగి అన్నాడు.

"పోనీ సంపాదించిన తర్వాత ఏం చేసేరు?"

"వీలయినన్నిసార్లు కలసి హాయిగా కొంతకాలం గడిపేము."

"ఆమెను పెళ్ళిచేసుకోవాలని పించ లేదా?"

"యస్! అనిపించింది. బహుశా అంతకంటె గాఢంగా ఎప్పుడూ ఏ పనీ చేయాలనిపించలేదు."

"మరి?......"

"వాళ్ళ తల్లిదండ్రులకు ఇష్టంలేదు."

"వాళ్ళ కీ విషయం తెల్సిందా?"

"ఆహా! దేవి చెప్పింది."

"దేవి ఎవరు?"

"ఆమే! ఆమె పేరు ప్రసన్న. కాని నేను ముచ్చటగా 'దేవి, అని పిలుస్తూండేవాడిని."

"మన చుట్టూ మనం ఎన్నో సంఘటనలు చూస్తున్నాం. యువతీ యువకుల ప్రేమకలాపాలు పెద్దలు ఎలా అంగీకరించలేకపోతున్నారో తెలుసుకుంటున్నాము. ఇంతమాత్రం ముందుచూపు మీకు లేకపోయిందా?"

ఆనంద్ మళ్ళీ కొంచెంసేపు ఆగేడు. చిరునవ్వుతోనే జవాబు చెప్పేడు.

"వాదంకోసమే అయితే ఎన్నో ప్రేమకలాపాలు సరియైన ముగింపుకు వచ్చేయని చెప్పి మీకు అనేకమైన ఉదాహరణలు చూపించేవాడి ననుకోండి!...... కాని మీ ప్రశ్నకు జవాబుగా చిన్నతనంలో నేను తెలుగు పుస్తకంలో చదువుకున్న యక్ష ప్రశ్నలు అనే పాఠంలో యక్షుడు అడిగిన ప్రశ్నకు ధర్మరాజు చెప్పిన జవాబు గుర్తుకొస్తూంది.......

"ఏమిటది?"

"ప్రశ్న—ప్రపంచంలో అన్నిటి కంటె వింతయిన దేమిటీ అని! దానికి జవాబు ఇలా ఉంటుంది......పుట్టినవా రందరూ మరణిస్తూన్న నిజాన్ని మనిషి నిత్యం చూస్తున్నా తను మరణించకుండా ఉండాలని కోరుకుంటాడు....అని."

"వండర్‌ఫుల్! చాలా బాగా చెప్పేరు." రఘుపతి అభినందించకుండా ఉండలేకపోయేడు.

ఆనంద్ అంతవరకూ మాట్లాడిన తర్వాత మనసులో వేదన చెప్పకుండా ఉండలేకపోయినట్లున్నాడు.

"కాని ఒక్క విషయంమాత్రం నన్ను బాధిస్తుంటుంది."

"ఏమిటది?"

"దేవి చాలా భావోద్రేకంగల మనిషి. మనసు చాలా సున్నితమైనది....ఆమె జీవితంతో రాజీపడగలదని నాకు నమ్మకం కుదరటంలేదు."

"అంటే ?"

"నావరకు ఆమెను పొందలేక పోవటం చాలా బాధ కలిగించింది. అయినా ఇదిగో! జ్ఞాపకాలకు ఫ్రేము కట్టించి ఇలా బ్రతికేస్తున్నానుకదా !.... కాని ఆ దేవి ఆ పనిచేయలేక పోతూందేమోనని భయంగా ఉంది."

"మీ ఊహలో ఆమె ఇప్పుడు ఎలా ఉండి ఉంటుంది."

"ఒక అగ్నిపర్వతంలా ఉంటుంది... అది పగిలేవరకూ అందులో ఏముందో తెలీదు."

"అంటే ?...."

"ఆమె ఉద్రేకాన్ని వ్యక్తపరచే మనిషికాదు. అది ఆమెను తునాతునకలు చేస్తుందేమోనని నా భయం !.... టెన్నీసన్ అనుకుంటాను, ఒక సందర్భంలో చెప్తాడు. ఒకామె ప్రియుడు యుద్ధంలో చనిపోతాడు. ఆ వార్త తెలియగానే అతని ప్రియురాలు స్తబ్ధురాలైపోతుంది. చలనంలేకుండా బిగిసిపోతుంది. ప్రక్కనే ఎవరో అంటారు .... లెట్ హెర్ క్రై ! లెస్ట్ షి మె డై ! అని......దేవిని తలచుకున్నప్పుడల్లా ఈ దృశ్యం నా కళ్ళ ముందు నిలుస్తుంది......"

"మీ భావాలు మీరు చాలా అందంగా చెప్తారు." అన్నాడు రఘుపతి ఆనంద్ కళ్ళల్లోకి మెచ్చుకోలుగా చూస్తూ.

"పెర్హాప్స్ !.... దేవికూడా ఈ మాట చాలాసార్లంది."

"మీరు పెళ్ళి చేసుకుంటారా ?" రఘుపతి ప్రశ్నతో ఆనంద్ ముఖంమీద చిరునవ్వు చటుక్కున మాయమైంది.

"ఇప్పుడు చేసుకోను." కొంచెం సీరియస్‌గానే అన్నాడు.

"ఎప్పటికీ చేసుకోరా ?"

"కనీసం కొన్ని సంవత్సరాలు దాని విషయం ఆలోచించలేననుకుంటాను."

"ఆ తర్వాత ?"

ఆనంద్ రఘుపతి ముఖంలోకి కొంచెం కలతతో చూసేడు. మరుక్షణంలోనే చూపుల్లో నిశ్చలత వచ్చేసింది. దృష్టి మరల్చకుండా,

"మీకు పెళ్ళయిందా ?" అని అడిగేడు ఆనంద్.

"అయింది."

"తర్వాత మీరు మరో స్త్రీతో మీ భార్యతో ఉండేంత చనువుగా ఉన్నారా ఎప్పుడైనా ?"

"ఇప్పటివరకూ లేదు."

"ఎప్పటికీ ఇలా ఉండగలుగుతారా?"

"ఓ ! మీరు చెప్పదలచుకున్నది అర్థమయింది.........మీ వివేకంతో మీ ఆవేశాన్ని కప్పిపుచ్చుకోగలుగుతారు."

"ఇప్పటివరకూ కావచ్చు !........ బహుశా ఎప్పటికీ కాకపోవచ్చు !"

"అబ్బా !....ఆమె అంత ఉద్రేక పూరితమైన మనిషి అన్నారుకదా ! ఆమె ఇప్పుడు వస్తే మీరు స్వీకరించగలరా ?"

"అది నేను ఊహించలేను."

"ఎందుకని ?"

"ఇప్పుడామెకు పెళ్లైంది. ఆ తర్వాత తన సుఖంకోసం మరొకరి బ్రతుకును అస్తవ్యస్తంచేసి పారిపోయే మనస్తత్వం కాదామెది !........"

"ఐసీ !....అటువంటప్పుడు ఆమె తల్లిదండ్రులను ధిక్కరించి మీరామెను ఎందుకు పెళ్ళిచేసుకోలేదు ?"

"నాకు చిన్నప్పటినుంచి నా అని చెప్పుకోదగ్గవాళ్ళెవరూ లేరు. తల్లిదండ్రులను వదులుకున్న ఆవేదన మాత్రం ఉంటుంది. అందుకే ఆమె నాతో సుఖంగా ఉంటుందని నమ్మకం ఉన్నా ఆమెను వాళ్ళవాళ్ళందరికీ దూరం చెయ్యడానికి జంకేను."

"మీ వయసులో మీరున్న పరిస్థితిలో మీలా బాధ్యతతో ఆలోచించేవాళ్ళు చాలా తక్కువ."

"థాంక్యూ వెరీమచ్ !....ఇఫ్ ఓన్లీ షి కుడ్‌బి సమ్ హౌ హేపీ !........"

రఘుపతి అభినందనతో అతనికి ఓదార్పు దొరికినట్లుంది.

"ఆ ఫోటోలో అదేమిటి రిస్ట్‌వాచ్ కూడా ఉంచేరు."

"నా దగ్గరకెప్పుడు వచ్చినా దేవి వెళ్ళవలసినటైము మరచిపోతూండేది. నీ పక్కన నా కీ వాచీ ఉన్నా దండుగే అని వెళ్ళేముందు నవ్వుతూ అంటూండేది. వాళ్ళనాన్నకు ఢిల్లీనుంచి ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోతూన్నప్పుడు ఆమెకు గుర్తుగా నాకీ వాచీ బహుమతి ఇచ్చింది. అది తిరగడం ఇష్టంలేక ఆమె బొమ్మ పక్కనే ఫోటోలో ఉంచేను.... ...."

ఆరాధనతో ఫోటోవైపు చూసేడు ఆనంద్.

రెండునిముషాల తర్వాత రఘుపతి ఉన్నట్లుండి అన్నాడు.

"ఆమెను ఎక్కువగా ఎటువంటి విషయాలు సంతోషపరుస్తాయి ?"

"వివరంగా అడగండి !"

"మీలో ఆమెను ఏమి ఆకర్షించి ఉండవచ్చు ? ఆమెకు ఎలా కాలం గడపడం ఇష్టం ?....ఏ రంగు ఇష్టం ? ఏ........"

"ఆమె కథ అడిగేరు ? చెప్పేను.... కాని ఇన్ని ప్రశ్నలు ఒక అపరిచిత వ్యక్తి ఫోటోగురించి .... అవసరమా?.."

"యస్ డియర్ ఆనంద్ ! ఆమె.... ఆమె నా భార్య." అన్నాడు రఘుపతి.

* * *

అడవుల మధ్యనుంచి రైలు వేగంగా పరుగుపెడుతూంది. అంతకంటె ఆత్రుతగా పరుగులుపెట్టి ఎన్నోసార్లు ఇంటికి చేరి మళ్ళీ శరీరంకోసం వెనక్కు వచ్చింది రఘుపతి మనస్సు.

రఘుపతి ఇంకా ఆశ్చర్యాన్నుంచి కోలుకోలేదు. పెళ్ళయిన ఈ ఏడాది

లోనూ ప్రసన్న ముఖం ఎప్పుడూ అప్రసన్నంగా చూడలేదు తను. ఉదయం కాకుండానే లేస్తుంది. గడియారంముల్లులా రాత్రి పడుకొనే వరకూ తనపని తాను గంభీరతతో కూడిన చిరునవ్వుతో చేసుకొనిపోతుంది. ఆ నిశ్చలత వెనకాల అగ్నిపర్వతంలో ఉన్న అలజడి ఉందా? జవాబు చెప్తున్నట్లుగా కొండలమధ్యనుంచి పరుగెడుతూన్న రైలు వినలేని రొదచేస్తూంది. కిటికీతలుపు క్రిందికి లాగి సీటులో ఒరిగేడు రఘుపతి.



* * *

రఘుపతి ఇంటిదగ్గర ఆటో దిగేసరికి అప్పుడే తెల్లవారుతూంది.

అనుకున్నట్లుగానే వీధిగుమ్మంలో ప్రసన్న నిలబడిఉంది. పెదవులమీద చిరునవ్వు రఘుపతికి తెలిసిన విపరాల మూలంగానేమో భావరహితంగా కనబడుతూంది. ఆ చిరునవ్వు వెనకాల ఆనంద్ చెప్పిన అగ్నిపర్వతం ఉందా? కనబడుతుందేమో చూడడానికి వ్యర్థ ప్రయత్నం చేసేడు రఘుపతి.

"ప్రయాణం బాగా జరిగిందా?"

"ఆఁ." యంత్రానికి స్విచ్ వేయబడిందనుకున్నాడు రఘుపతి. అతనితోపాటు కొన్ని సామానులు ప్రసన్నకూడా లోపలికి పట్టింది. "రండి వేన్నీళ్ళు తోడతాను. స్నానం చేద్దురుగాని!" లోపలకు వెళ్ళింది నీళ్ళు తోడడానికి.

కాలకృత్యాలు ముగించుకొని తెచ్చిన సామాన్లలో ఆఫీసుకాగితాలు కొన్ని సర్దుతూంటే మత్తుగా అనిపించి మూసుకొన్నాడు. రఘుపతి తిరిగి కళ్ళు కళ్ళు తెరిచేసరికి బయట ఎండలు వచ్చినట్లున్నాయి.

టైమెంతయిందోనని వాచీ తీసుకున్నాడు రఘుపతి. ముందురోజు ట్రెయిన్‌లో వాచీ చెయ్యినుండి తియ్యనేలేదు. కీ ఇయ్యడం మరిచిపోయేడు. వాచీ ఆగిపోయింది. ప్రసన్న అప్పుడే గుమ్మంలోకి కాఫీకప్పుతో రావడంతో వాచీలో సరిగా ఏడున్నరకు టైము సర్దుకున్నాడు రఘుపతి. అప్పటినుండి ఆ రోజు మధ్యాహ్నం ఆఫీసుకు వెళ్ళే వరకూ ఎంత చూద్దామని ప్రయత్నించినా అతనికి ఆమెలో కంటికి కనబడని ఆ నిప్పుజాడ కొంచెంకూడా తోచలేదు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత ఆ సాయంత్రమూ రాత్రీ కొంచెం ఇబ్బందిగానే గడిచేయి రఘుపతికి

మర్నాడు ఉదయం లేవగానే వంటింటిదగ్గరకొచ్చి, "ఈ పూటకు వంట చెయ్యకు!" అన్నాడు.

"ఏం?"

"ఊరికేనే! సరదాగా బయట తిందాం."

"అదేమిటి? మరి ఆఫీసు?"

"వెళ్ళటంలేదు. రెండురోజులు శలవుపెట్టేను."

ప్రసన్న ఆశ్చర్యంగా చూసింది.

"ఏంలేదు ........ ఆఫీసుకు వెళ్ళాలంటే బోర్ కొడుతూంది. అందులో ఇన్నిరోజులూ నిన్నువిడచి ఉన్నానేమో దృష్టంతా నీమీదే ఉంటూంది." ప్రసన్న ముఖం కొంచెం సీరియస్‌గా మారడం చూసేడు రఘుపతి.

"నిన్న ఇయ్యడం మరిచిపోయేను. ఇదిగో నీకోసం ఢిల్లీనుంచి చీర తెచ్చేను." సూట్‌కేస్‌లోంచి చీర తీసి ఇచ్చేడు.

ప్రసన్న చీర అందుకొని లోపలకు

వెళ్ళబోతూంటే, "మడతవిప్పి చూడు! ఈ రోజు కట్టుకో." అన్నాడు.

ప్రసన్న మడతవిప్పి చూసింది.

అది లేతాకుపచ్చ రంగుమీద ఎరుపు నీలంపువ్వులున్న నైలెక్సుచీర.

"తరువాత కట్టుకుంటాలెండి." అలజడిగా వచ్చింది ప్రసన్న గొంతులోంచి.

"ప్లీజ్! ఈరోజే కట్టుకోవాలి."

ఆ చీరలో ప్రసన్న అందం నిజంగా రెండింతలయినట్లుంది. కాని ఆమె ముఖంలో మాత్రం ఉత్సాహం ఏ మాత్రం కనబడటంలేదు. రోజూ ఆమెలో కనబడే స్థిరత్వంకూడా కొంచెం తగ్గినట్లనిపించింది.

ఇద్దరూ హోటల్లో భోజనంచేసేరు.

భోజనంచేస్తూంటే రఘుపతి ప్రసన్న ప్లేటులోంచి కొంచెం కూరతీసుకున్నాడు.

"అరె! నా ప్లేటులో కూరకంటె ఇది ఇంత రుచిగా ఉందేమిటి?"అన్నాడు. ప్రసన్న ఉలిక్కిపడి చాలా అసహజంగా నవ్వింది. లోపల నిప్పు రగులుకుంటూన్నట్లు గుర్తించేడు రఘుపతి.

తర్వాత మధ్యాహ్నం మ్యాట్నీకి వెళ్ళేరు.

సినిమా చూస్తూన్నంతసేపూ రఘుపతి ఇంచుమించుగా ప్రసన్న ముఖంవైపు చూస్తూ కూర్చున్నాడు.

"నావైపు చూస్తారేమిటి? సినిమా చూడండి." అంది ప్రసన్న.

"నాకు సినిమాకంటే నీ ముఖమే చూడాలనిపిస్తూంది." అన్నాడు రఘుపతి.

అక్కడనుండి ఇద్దరూ నౌబత్ పహాడ్‌మీద ఎక్కి కూర్చున్నారు.

సాయంత్రపు నీరెండలో ప్రసన్నను రెప్పవాల్చకుండా చూస్తూ వెల్లకిలా తలక్రింద చేతులుపెట్టుకొని పడుకున్నాడు రఘుపతి. చెదిరిన జుట్టు ప్రసన్న ముఖంపై చిరుగాలికి నాట్యంచేస్తూంది.

"ఇప్పుడు నువ్వెలా ఉన్నావో చెప్పనా?" అన్నాడు రఘుపతి. ప్రసన్న తలవంచుకొని గడ్డిపరకలు తుంచుతూంది.

"సూర్యుడి బంగారుకిరణాలు నీమీద పడుతుంటే ప్రపంచానికి అందని ఎత్తులో ఉన్న కొండమీద పూచిన పువ్వులా ఉన్నావు." చటుక్కున కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లి ప్రసన్న తల పక్కకు తిప్పుకుంది.

అది గమనించి రఘు మాట్లాడుతూనే ఉన్నాడు.

"....మొదటిసారి నిన్ను చూసినప్పుడు నాకనిపించింది నేను ఎదురుచూస్తూన్నది నీకోసమేనని. ఆ తర్వాత నాకు మరొకరిని చూడాలనే అనిపించలేదు. నిన్ను చేసుకొని నాయంత అదృష్టవంతుడు లేడని మురిసిపోయేను. అయినా అందరి అదృష్టాలు ఒకచోట కలుస్తాయా అని నాకు అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. నిన్ను పొంది నేను ఎంత అదృష్టవంతుడిని అనుకుంటున్నానో అలాగే నన్ను పొందిన నువ్వు కూడా అలాగే అనుకుంటే ఎంత బాగుంటుంది! కాని అది సాధ్యమా అని అప్పుడప్పుడు ఆలోచిస్తుంటాను. అటువంటి ఆలోచన నీ మనసులో లేదేమో అనిపించినప్పుడు కొంచెం భయంగా ఉంటుంది...."

"నేనూ అలాగే అనుకుంటున్నాను." తల తిప్పకుండానే అంది ప్రసన్న.

"ఏమో!... కొంతమంది సాంగత్యంలో పరవశించిన మనసుకు కాలగమనం తెలీదు. అది తెలుసుకోడానికి తిరిగే గడియారం ముళ్ళవైపు చూడాలి. మనసును పరవశింపజేయలేని మనిషి సమక్షంలో గడియారం అవసరంలేదు. మనసే గడియారం ముళ్ళతో తిరుగుతూంటుంది.... నేను కోరుకొనేది ముందు నీ సుఖం.... ఆనందం. తర్వాత నాది. నీ సుఖంకోసం, నీ ఆనందంకోసం నేను ఏం చెయ్యడానికైనా సిద్ధమే! అందుకోసం నిన్ను వదులుకోవలసివచ్చినా ...."

ప్రసన్న నీళ్ళునిండిన కళ్ళతో చటుక్కున రఘుపతివైపు చూసింది.

"....యస్! నిజం ప్రసన్నా! అందుకే ఉదయంనుండి నీ గతజీవితంలో సంఘటనలను గుర్తుచేసి మెషీనులా పనిచేస్తూన్న నీ మనసును కొంచెం కదిపేను. నువ్వు ఆనంద్‌తో సుఖంగా ఉండగలుగుతావనిపిస్తే...."

"ఏమండీ!" ప్రసన్న భోరున ఏడుస్తూ రఘుపతి ఒడిలో వాలిపోయింది.

"నిజం ప్రసన్నా! ఐమీన్ వాటై సే. నువ్వేం నేరంచెయ్యలేదు. ఆనంద్ చాలా మంచిమనిషి. అటువంటి మనిషిని ఇష్టపడడంలో తప్పులేదు. కాని మన సొసైటీ సెటప్‌లో కొన్ని ఇటువంటి ప్రమాదాలు తప్పవు...."

"ప్లీజ్! అలా మాట్లాడకండీ!" అంది ప్రసన్న ఏడుస్తూనే.

* * *

ఆ రాత్రి పదిన్నర గంటలకు రఘుపతి హృదయంమీద వాలిఉన్న ప్రసన్న ఉలిక్కిపడి లేచింది.

"చూసేరా! తొమ్మిదింటికి మీకు పాలగ్లాసివ్వడం మరచిపోయేను." అంటూ పక్క దిగబోయింది.

"పోనీ! మరబొమ్మలా నాకు సేవలు చేసేకన్నా మనిషిగా ఒక్కసారి మైమరచి నా గుండెలపై నిద్రపో!" అని ప్రేమతో సంతృప్తితో దగ్గరకు తీసుకొని ఆమె తలను హృదయాని కాన్చుకున్నాడు రఘుపతి.

———